క్లుప్తంగా

పరిసరాల శుభ్రత.. అందరి బాధ్యత



కళాశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

శ్రీకాళహస్తి: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ, అధ్యాపకులు బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై 9 ఫిర్యాదులు



అర్జీలను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

నాగలాపురం: స్థానిక ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయంలో బుధవారం పుత్తూరు డివిజన్ ట్రాన్స్‌కో ఈఈ దేవాశీర్వాదం ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి హాజరై మాట్లాడారు. 9 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. వారి వినతులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీ రమేష్ చంద్ర, ఆర్థిక సభ్యులు, కె.రామ్‌మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భవతులకు వైద్య పరీక్షలు



గర్భవతులకు అన్నదానం చేస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ వందన అభియాన్ పథకం కింద బుధవారం 82 మంది గర్భవతులకు వైద్యాధికారిణి మాధవి, డాక్టర్ విద్యాసాగర్ వైద్య పరీక్షలను నిర్వహించారు. మొదటి కాన్పు వారందరూ ప్రధానమంత్రి మాతృత్వ వందన అభియాన్ యోజన పథకం దరఖాస్తు కోసం వారి బ్యాంకు అకౌంట్, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్లును అందజేయాలన్నారు. అనంతరం ఉచితంగా కాల్షియం, ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది గర్భవతులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటిని దర్శించుకున్న ఎమ్మెల్సీ దువ్వాడ



ఆలయం వద్ద ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

13న గాజులమండ్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రేఖ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం గాజులమండ్యంలో 13వ తేదీ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు రేవా డయాబెటిస్ క్లినిక్ ఎండీ డాక్టర్ రేఖ కత్తుల తెలిపారు. ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం గ్రామంలో ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. శిబిరంలో స్త్రీల వ్యాధి నిపుణులు, చర్మవ్యాధి నిపుణులు, కీళ్ల వ్యాధులకు, జనరల్ వ్యాధులకు సంబంధించి 20 మంది వైద్య నిపుణుల బృందంతో వైద్యపరీక్షలు చేయనున్నట్టు చెప్పారు. మందులతో పాటు గ్లూకోమీటర్లు కూడా ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. మండల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు అందని వైద్యం

సామాన్య ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం దూరమవుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోంది. తగినంత సిబ్బందిని, వైద్యులను భర్తీ చేయడం లేదు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొక్కుబడి వైద్యసేవలకు పరిమితమవుతున్నాయి. ఫలితంగా పేద ప్రజలు సైతం అప్పులు చేసి మరీ వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రుల బాట పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అన్ని హంగులతో అభివృద్ధి చేసి, ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండేలా రూపకల్పన చేసి, పేద ప్రజల వైద్యానికి పెద్దపీట వేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉన్న వైద్యులను తొలగించి అరకొర సిబ్బందితో వైద్యసేవల్ని నీరుగారుస్తోంది.



చిన్న పాండూరు పీహెచ్‌సీలో వైద్యం కోసం వేచి వున్న ప్రజలు, (ఇన్‌సెట్) నాగలాపురం పీహెచ్‌సీలో వైద్యాధికారి గైర్హాజరవడంతో ఖాళీ కుర్చీలతో వైద్యాధికారి గది

- పీహెచ్‌సీల్లో ఒకే వైద్యుడితో మొక్కుబడి వైద్యసేవలు
- వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వ పాలనలో ఇంటి ముంగిటకే వైద్యం

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీ పురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 9 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో పీహెచ్‌సీలో రోజువారీ 250పై చిలుకు ప్రజలు వైద్యసేవలు పొందుతూంటారు. అయితే సంబంధిత పీహెచ్‌సీలలో ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండాలి. అయితే దీనికి భిన్నంగా కొన్నిచోట్ల ఒక్క వైద్యుడితో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కొనసాగడం గమనార్హం.

ఒక్కడితోనే ఆ మూడు పీహెచ్‌సీలు!

నియోజకవర్గంలోని చిన్న పాండూరు, దాసుకుప్పం, నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒకేఒక వైద్యాధికారితో ఓపీ నిర్వహిస్తున్నారు. ఈ మూడు పీహెచ్‌సీల పరిధిలో రోజుకు ఒకో పీహెచ్‌సీ వద్దకు 250 మందికి పైగా వైద్యం కోసం వస్తుంటారు. అయితే ఒకేఒక వైద్యాధికారి విధులకు హాజరవుతుండడంతో వైద్యం కోసం గంటల తరబడి ఆస్పత్రి వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో ఆ వైద్యాధికారి వ్యక్తిగత, శాఖాపరమైన పనుల మీద వెళ్లితే ఆ రోజు పేద ప్రజలకు వైద్యసేవలు అందని పరిస్థితి. ఉన్న కిందస్థాయి సిబ్బందితో మొక్కుబడి వైద్యసేవలు అందివ్వాల్సి వస్తోంది.

నామమాత్రంగా 104 వైద్య సేవలు

గత ప్రభుత్వంలో ఇళ్ల వద్దకే వైద్యం అందించాలన్న సంకల్పంతో వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చారు. తద్వారా 104 వాహనం ద్వారా రోజువారీ ఒక్కో గ్రామంలో వైద్యసేవలను అందజేసేవారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక 104 వాహనాన్ని కేటాయించి, ఆ వాహనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శిబిరానికి హాజరై రోగులను పరీక్షించేవారు. అయితే నాగలాపురం, దాసుకుప్పం, చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి ఒకే ఒక్క వైద్యాధికారి ఉండడంతో 104 శిబిరానికి వెళ్లలేని పరిస్థితి. దీంతో సిబ్బందితో మొక్కుబడిగా 104 వాహన వైద్యసేవలను కొనసాగిస్తున్నారు.

ఆ మూడు చోట్ల భర్తీ అయ్యేనా?

చిన్న పాండూరు, నాగలాపురం, దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులకు నెలరోజుల క్రితం ఉన్నత చదువులు చదివేందుకు ఎంపికయ్యారు. దీంతో ఆ మూడు పీహెచ్‌సీల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ఆ స్థానాల్లో వైద్యుల భర్తీకి వైద్యఆరోగ్య శాఖ చొరవ చూపడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.





ఒకే ఒక్క వైద్యురాలితో కొనసాగుతున్న చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నాగలాపురం పీహెచ్‌సీలో వైద్యం కోసం వేచి వున్న స్థానికులు

ఆర్టీసీ కౌన్సిల్ న్యాయవాదిగా రాజేశ్వరరావు



శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా ఏపీఎస్ ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా పట్టణానికి చెందిన గుమ్మళ్ల రాజేశ్వరరావు నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పడిన తరువాత మొదటిసారిగా ఏపీఎస్ ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా తనను నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఆర్టీసీలో పెండింగ్ కేసుల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు.

29వ రోజుకు చేరిన రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న చిన్నిరాజ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 29వ రోజుకు చేరింది. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నిరాజ్ మాట్లాడుతూ, కనమనంబేడు గ్రామ రెవెన్యూలోని 252, 253, 254 సర్వే నంబర్లలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాల కోసం స్వాధీనం చేసుకున్నామని, ఈ భూమికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు లేక ఒకే ఇంట మూడు కుటుంబాలు సైతం ఉంటున్నాయని, ఇళ్ల పట్టాలు ఇచ్చేవరకు దీక్షలు విరమించే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి ధర్మయ్య, గ్రామస్తులు రమణయ్య, సుబ్రమణ్యం, వీరాస్వామి, మణి, గోయల్‌బాబు, గుర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలించిన జాయింట్ కలెక్టర్



రికార్డు గదిని పరిశీలిస్తున్న అదనపు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

సత్యవేడు: తిరుపతి జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సత్యవేడు తహసీల్దార్ కార్యాలయ రికార్డులను బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక ఆర్థిక మండలి విస్తతి నిమిత్తం మండలంలో 2,580 ఎకరాలను భూసేకరణకుగాను ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఎల్‌జీ కంపెనీకి ఇరుగుళం, కొల్లడం రాచపాళెం, పెద్ద ఈటిపాకం, చిన్న ఈటిపాకం గ్రామాలకు సంబంధించి 320 ఎకరాల భూమిని ఏపీఐఐసీ ద్వారా కొనుగోలు చేసే కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల రికార్డులను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ప్రత్యేక ఆర్థిక మండలి(శ్రీసిటీ)కి ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వం 7,500 ఎకరాలు రైతుల భూములు కొని కంపెనీల నిర్మాణానికి నిర్దేశించిందని , ప్రస్తుతం అదనంగా భూసేకరణకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. చట్ట ప్రకారం రైతులకు అందవలసిన భూ పరిహారం ఇచ్చేందుకు కూడా చర్యలు తీసుకొంటామన్నారు. త్వరలో ఆయా గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించనున్నట్లు తెలిపారు.

'రాంగ్ రూట్‌లో వెళ్తే బుక్ అయినట్లే..!'





రాంగ్ రూట్లో వస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తున్న పోలీసులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట, గాజులమడ్యం, ఏర్పేడు పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని అన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపిన వారిపై మొత్తం 77 కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరచామని తెలిపారు. కోర్టు ఒక్కొక్కరికి 2500 రూపాయలు జరిమానా విధించారని తెలిపారు.139 వాహనాలను సీజ్ చేసామని, ప్రమాదాల నివారణకే గాక, ఇతరుల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సమ్మె బాట పట్టిన పారిశుద్ధ్య కార్మికులు



పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మేజర్ పంచాయతీలోని పారిశుద్ధ్యం, నీటి సరఫరా విభాగాల కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సమ్మె బాట పట్టారు. దీంతో ఈఓపీఆర్డీ ప్రభురావు పంచాయతీ కార్యాలయంలో, డీపీఓ సుశీలదేవి ఫోన్లో కార్మికులతో మాట్లాడినా తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని తెగేసి చెప్పారు. కార్మికుల సమ్మెతో రేణిగుంటలో పారిశుధ్య సమస్యలు ఉత్పన్నమయ్యాయి. పనికి తగిన జీతం ఇవ్వాలని, మైనర్ పంచాయతీల్లో రూ.18వేలు జీతం ఇస్తున్నా మేజర్ పంచాయతీ అయిన రేణిగుంటలో తమ శ్రమదోచుకుంటూ రూ.13వేలే ఇస్తున్నారని కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. పీఎఫ్ డబ్బులు వచ్చేలా చూడాలని నినదించారు. ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ప్రతి రెండు నెలలకో ఈఓ మారుతుండడంతో తమ సమస్యలను పరిష్కరించే నాధుడే కరువయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి కార్తీక్, పంచాయతీ కార్మికులు రమణ, చంద్రకళ తదితరులు మాట్లాడారు.

ప్రభుత్వ అధికారికి ఓ రూలు.. ప్రజలకు మరో రూలా..?



ప్రభుత్వ అధికారి ఇంటిని వదిలి తవ్విన కాలువ

శ్రీకాళహస్తి: పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో మున్సిపల్ అధికారులు కాలువల నిర్మాణానికి పూనుకున్నారు. ఆ కాలనీలో ప్రజల ఇళ్ల ముందు కాలువను జేసీబీతో తవ్వించారు. ఇక్కడ ఎవరైతే కాలువపై మెట్లు నిర్మించుకున్నారు వాటిని కూడా తొలగించారు. కానీ ఓ పంచాయతీ అధికారి ఇంటి ముందు మాత్రం జేసీబీతో తవ్వొద్దని హుకుం జారీ చేయడంతో అక్కడ కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తి వెనుదిరిగాడు. దీంతో చేసేదేమీ లేక ఆ అధికారి చెప్పినట్టు మనుషులతో తవ్విస్తున్నారు. అతని ఇంటి వద్ద మెట్లు తొలగించకుండా కాలువ నిర్మాణం ఎలా చేస్తారో ఆ కాంట్రాక్టర్‌కే తెలియాలి. సామాన్య ప్రజలకు ఓ న్యాయం.. అధికారులకు ఇంకో న్యాయమా? అని స్థానికులు దుమ్మెత్తిపోస్తున్నారు. కమిషనర్ దీనిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్కూటీని ఢీకొన్న కారు: మహిళకు తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన మహిళను అంబులెన్స్‌లో తరలిస్తున్న స్థానికులు

నాగలాపురం: స్కూటీని కారు ఢీకొనడంతో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం పిచ్చాటూరులోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మేరకు పిచ్చాటూరు బైపాసు వద్ద టీచర్స్ కాలనీకి చెందిన మంజుల(43) తన ఇంటి నుంచి సొంత పనుల నిమిత్తం స్కూటీలో టౌనుకు వెళ్తూ వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ప్రమాదానికి గురైంది. రోడ్డు దాటుతుండగా ఊత్తుకోట నుంచి పుత్తూరు వైపు వేగంగా వెళ్తున్న కారు స్కూటీని ఢీకొనడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో నగరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునేలోపు ప్రమాదానికి కారణమైన కారు అక్కడ నుంచి అదృశ్యమైంది.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం




మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: భూముల రీ–సర్వేతో భూసమస్యల పరిష్కారం అవుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీదేవి కోరారు. బుధవారం కుమ్మరవెంకటపురం గ్రామ రెవెన్యూలో భూముల రీ–సర్వేపై గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, భూముల రీ సర్వేలో అన్ రిజిస్టర్, వంశపారం పర్య భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తామని, పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కరమవుతాయన్నారు. భూ కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తారని తెలిపారు కుమ్మరవెంకటపురం గ్రామ రెవెన్యూలో 133.45 ఎకరాలు భూముల రీ–సర్వే పూర్తయ్యిందన్నారు. దీనికి సంబంధించి సందేహాలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ నల్లయ్య, సర్వేయర్ రాజ్‌కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఎమ్మెల్సీ ఇవ్వకపోవడం శోచనీయం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రాష్ట్రంలో 20 లక్షల మంది ముదిరాజ్‌లు ఉన్నా, కూటమి ప్రభుత్వం కనీసం ఒక్క ఎమ్మెల్సీ పదవి కూడా ఇవ్వకపోవడం శోచనీయమని రాష్ట్ర ముదిరాజ్ సంఘ నాయకులు విమర్శించారు. బుధవారం రేణిగుంట మండలం కరకంబాడి చెరువు కట్టకింద ఉన్న కట్ట పుట్టాలమ్మ ఆలయాన్ని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ముదిరాజ్ నాయకులు దర్శించుకున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కురకాల్వ వాసు వారికి స్వాగతం పలికారు. పూజల అనంతరం వారు మాట్లాడారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కొర్ని వెంకటనారాయణ, ముదిరాజు రాష్ట్ర నాయకులు కోమటి విష్ణువర్ధన్, పాము రవికుమార్, బోనం శేషగిరిరావు, కనకట్ల మోహన్ రావు, పేరంమాళ్ల వీరన్న, మణి, మేర రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుకుంటే పడిపోయాయి..!



పడిపోయిన గ్రిల్స్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో లక్షలాది రూపాయలు వెచ్చించి గోడకు నిర్మించిన గ్రిల్స్ చిన్న ఒత్తిడికే పడిపోవడంతో విమర్శలకు తావిస్తోంది. ఆలయ ఇంజినీరింగ్ విభాగం పనితీరు ఎలా ఉంటోందో ఇది చెప్పకనే చెప్పింది. గతంలో రూ.23లక్షలతో నిర్మించిన ఆ గ్రిల్స్‌ను తొలగించి శివరాత్రి సమయంలో మళ్లీ అత్యవసరంగా సుమారు రూ.30లక్షలతో కొద్దిగా గోడను తొలగించి నిర్మించారు. అయితే క్యూరింగ్ చేయకపోవడం..ఇతర కారణాలతో చిన్న ఒత్తిడికే పడిపోతున్నాయి. రిలా అత్యవసరంగా పాలకుల మెప్పు కోసం చేసిన పనులు నాసిరకంగా ఉన్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట సీఆర్ఎస్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఆస్టర్ నారాయణాద్రి, పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీఆర్ఎస్ సీడబ్ల్యూఎం దేవసహాయం శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ జనార్ధన్, డాక్టర్ బ్రహ్మానందం సందర్శించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, కార్యదర్శి విజయ్ కుమార్, గజపతి నాయుడు, కృష్ణదాసు, కృష్ణమూర్తి రెడ్డి, ఆనంద్, జబ్బార్ పాల్గొన్నారు.

సత్యవేడు: తమిళనాడుకు ఇసుక తరలిస్తున్ననట్టు తమ గురించి పోలీసులకు సమాచారమిచ్చాడనే అనుమానంతో ముగ్గురు వ్యక్తులు ఓ వ్యక్తిపై రాయితో దాడి చేసి గాయపరచిన సంఘటన బుధవారం రాత్రి మండలంలోని మల్లవారిపాళెం ఈస్టు పంచాయతీ అప్పయ్యపాళెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అశోక్, బాలాజి, అమర్ గ్రామస్తుడు ఎస్.వెంకటేశ్ నాయుడు(49)పై దాడి చేశారు. వెంకటేశ్ తమపై పోలీసులకు ఇసుక అక్రమ రవాణాపై తెలియజేశాడనే అనుమానంతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. బంధువులు అతడిని సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. డాక్టర్ సాహెల్ ప్రథమ చికిత్స చేసి తిరుపతికి రెఫర్ చేశారు. బాధితుని బంధువులు ఆ ముగ్గురు నిందితులపై శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు.